నేటి మ్యాచ్
ఆస్ట్రేలియా X నెదర్లాండ్స్
మ. 2.00 నుంచి
వేదిక: ఢిల్లీ

దీప్తికి పసిడి

పారా ఆసియా క్రీడలు

ఆసియా రికార్డు నెలకొల్పిన తెలంగాణ అథ్లెట్

హాంగ్జౌ: ఆసియా పారా క్రీడల్లో తెలంగాణ యువ అథ్లెట్ జివాంజి దీప్తి పసిడి పతకం చేజిక్కించుకుంది. చైనాలోని హాంగ్జౌ వేదికగా జరుగుతున్న మెగాటోర్నీలో ఈ ఓరుగల్లు బిడ్డ మహిళల 400 మీటర్ల (టీ20) పరుగు పందెంలో 56.69 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఆసియా రికార్డు బద్దలు కొట్టడంతో పాటు స్వర్ణం సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడ్డ తొలిసారే అద్భుత ప్రదర్శన కనబర్చిన దీప్తిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల ఆసియా క్రీడల్లో భారత్ తొలిసారి వంద పతకాల మార్క్ దాటి చరిత్ర లిఖించగా.. ఇప్పుడు పారా ఆసియా క్రీడల్లోనూ మనవాళ్ల జోరు కొనసాగుతున్నది. రెండోరోజు మంగళవారం పోటీలు ముగిసే సరికి భారత్ 34 పతకాలతో పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. ఇందులో 9 స్వర్ణాలు, 12 రజతాలు, 13 కాంస్యాలు ఉన్నాయి. మంగళవారం మహిళల కనోయ్ (కేఎల్2) విభాగంలో ప్రాచీ యాదవ్ స్వర్ణం నెగ్గగా.. పురుషుల డిస్కస్ త్రో (ఎఫ్ 54/55/56) లో నీరజ్ యాదవ్ పసిడి పతకంతో మెరిశాడు. ఈ ఈవెంట్‌లో యోగేశ్, ముత్తురాజ వరుసగా రజత కాంస్యాలు దక్కించుకున్నారు. ఇప్పటికే కనోయ్ (వీఎల్2) విభాగంలో రజతం నెగ్గిన ప్రాచీ.. ఇప్పుడు డబుల్ ధమాకా మోగించింది. ఇతర విభాగాల్లో రవి (ఎఫ్40 షాట్‌పుట్), ప్రమోద్ (టీ46 1500 మీటర్లు), అజయ్ (టీ64 400 మీ.), సిమ్రన్ (టీ12 100 మీ.) రజత పతకాలు సాధించారు.

శ్రీజకు రజతం.. స్నేహిత్‌కు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: టేబుల్ టెన్నిస్ (టీటీ) జాతీయ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్యాడ్లర్లు ఆకుల శ్రీజ రజత పతకం సొంతం చేసుకోగా.. స్నేహిత్ కాంస్యంతో మెరిశాడు. తిరువనంతపురం వేదికగా జరిగిన ఈ టోర్నీలో ఆర్బీఐ తరపున బరిలోకి దిగన టాప్ సీడ్ శ్రీజ ఫైనల్లో 1-4 (8-11, 11-5, 5-11, 9-11, 10-12)తో దియా పరాగ్ చేతిలో ఓడింది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో స్నేహిత్ 3-4 (7-11, 11-3, 15-13, 4-11, 10-12, 13-11, 7-11)తో మానవ్ ఠక్కర్ చేతిలో ఓటమి పాలయ్యాడు. ఫైనల్లో సీనియర్ ప్లేయర్ శరత్‌కమల్‌ను మట్టికరిపించిన మానవ్ టైటిల్ చేజిక్కించుకున్నాడు. మరోవైపు గోవా వేదికగా జరుగుతున్న జరుగుతున్న జాతీయ క్రీడల్లో తెలంగాణ ప్లేయర్లు పతకాలతో మెరిశారు. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో తరుణ్ స్వర్ణం పతకం సాధించగా.. మహిళల సింగిల్స్‌లో మేఘన రెడ్డి కాంస్య పతకం చేజిక్కించుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో నవ్‌నీత్-మనీషా జంట రజత పతకం గెలుచుకుంది.

హైదరాబాద్‌లో నిర్వహించిన పీఎన్‌బీ మెట్‌లైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఆదిత్య, శ్రీవల్లి టైటిల్స్ గెలుచుకున్నారు

సఫారీ సవారీ

దంచికొట్టిన డికాక్
దూసుకెళ్తున్న దక్షిణాఫ్రికా
బంగ్లాదేశ్ నాలుగో ఓటమి

నెదర్లాండ్స్ చేతిలో అనూహ్య పరాజయం ఎదుర్కొన్న దక్షిణాఫ్రికా.. ఆ తర్వాత గాయపడ్డ సింహంలా గర్జిస్తున్నది. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన సఫారీలు.. తాజాగా బంగ్లాదేశ్‌ను బెంబేలెత్తించారు. డికాక్ భారీ సెంచరీతో విరుచుకుపడితే.. బంగ్లా బౌలర్లకు క్లాసెన్ పగటి పూటే చుక్కలు చూపాడు.



డికాక్ (174)

ముంబై: దంచుడే పరమావధిగా సాగుతున్న దక్షిణాఫ్రికా.. వన్డే ప్రపంచకప్‌లో నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో దక్షిణాఫ్రికా 149 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తుచేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సఫారీలు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 382 పరుగులు చేశారు. డికాక్ (140 బంతుల్లో 174; 15 ఫోర్లు, 7 సిక్సర్లు) రికార్డు సెంచరీతో చెలరేగగా.. హెన్రిచ్ క్లాసెన్ (49 బంతుల్లో 90; 2 ఫోర్లు, 8 సిక్సర్లు), డేవిడ్ మిల్లర్ (15 బంతుల్లో 34 నాటౌట్; ఒక ఫోర్, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ (60) అర్ధశతకం సాధించాడు. బంగ్లా బౌలర్లలో హసన్ మహమూద్ 2 వికెట్లు తీశాడు. అనంతరం భారీ లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 46.4 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. సీనియర్ ప్లేయర్ మహ్ముదుల్లా (111; 11 ఫోర్లు, 4 సిక్సర్లు) సెంచరీతో పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ షకీబ్ (1), నజ్ముల్ (0), ముష్ఫికర్ (8), లిటన్ దాస్ (22), తన్జీద్ (12), మెహదీ (11) విఫలమయ్యారు. సఫారీ బౌలర్లలో గెరాల్డ్ 3, జాన్సెన్, లిజాడ్, రబడ తలా రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. తాజా ప్రపంచకప్‌లో మూడో సెంచరీ నమోదు చేసుకున్న డికాక్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

సంక్షిప్త స్కోర్లు

దక్షిణాఫ్రికా: 382/5 (డికాక్ 174, క్లాసెన్ 90; మహమూద్ 2/67), **బంగ్లాదేశ్:** 46.4 ఓవర్లలో 233 ఆలౌట్ (మహ్ముదుల్లా 111; గెరాల్డ్ 3/62, జాన్సన్ 2/39).

పాకిస్థాన్‌కు ఘోర పరాభవం

అఫ్గాన్ చేతిలో ఓటమి

చెన్నై: 'ఒక్క మ్యాచ్ ఫలితంతో నా కెప్టెన్సీకి వచ్చిన ముప్పేం లేదు' ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా మ్యాచ్ సందర్భంగా పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ చేసిన వ్యాఖ్య ఇది. కానీ ఇప్పుడు అదే నిజమయ్యేలా కనిపిస్తున్నది. రోహిత్ సేన చేతిలో చావుదెబ్బ తిన్న పాక్.. ఆ తర్వత పేలవ ఆటతీరుతో ఆస్ట్రేలియాతో పాటు అఫ్గాన్ చేతిలోనూ పరాజయం పాలైంది. సోమవారం చెన్నై వేదికగా జరిగిన పోరులో పాకిస్థాన్ 8 వికెట్ల తేడాతో అఫ్గానిస్థాన్ చేతిలో ఓడింది. మొదట పాక్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 282 పరుగులు చేస్తే.. ఛేదనలో అఫ్గాన్ 49 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 286 పరుగులు చేసింది. ఇబ్రహీం జద్రాన్ (87), రహ్మానుల్లా గుర్బాజ్ (65), రహ్మత్ షా (77 నాటౌట్), హష్మతుల్లా (48 నాటౌట్) రాణించారు. చెపాక్ స్టేడియంలో నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగిన అఫ్గాన్.. ప్రత్యర్థిని స్పిన్ ఉచ్చులో బిగించి ఉక్కిరి బిక్కిరి చేసింది. వన్డే క్రికెట్ చరిత్రలో అఫ్గాన్ జట్టుకు పాకిస్థాన్‌పై ఇదే తొలి విజయం కాగా.. 92 బంతుల్లో 74 పరుగులతో జిడ్డు ఆట ఆడిన బాబర్‌పై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అతడిని సారథ్య బాధ్యతల నుంచి తప్పించాలని ఆ దేశ మాజీ ఆటగాళ్లు డిమాండ్ చేస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో నాసిరకం ప్రదర్శన కనబర్చిన జట్టుపై సొంత దేశంలో అభిమానులు సైతం దుమ్మెత్తిపోస్తుంటే.. తదుపరి సారథిగా రిజ్వాన్, షాహీన్, సర్ఫరాజ్ పేర్లు తెరమీదకు వస్తున్నాయి. తాజా వరల్డ్‌కప్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో మూడింట ఓడిన పాకిస్థాన్ ఇక సెమీఫైనల్‌కు చేరాలంటే.. మిగిలిన మ్యాచ్‌లన్నీ గెలువక తప్పని పరిస్థితి నెలకొంది.

బాబర్

బేడీ కన్నుమూత

న్యూఢిల్లీ: స్పిన్ మాంత్రికుడు, భారత మాజీ కెప్టెన్ బిషన్ సింగ్ బేడీ (77) సోమవారం కన్నుమూశారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బేడీ సోమవారం తుది శ్వాస విడిచారు. జాతీయ జట్టు తరపున 67 టెస్టులు, 10 వన్డేలు ఆడిన బేడీ.. సుదీర్ఘ ఫార్మాట్‌లో 266 వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. 1975 నుంచి 79 వరకు భారత టెస్టు కెప్టెన్‌గా సేవలందించిన బేడీ.. ఆ తర్వాత టీమ్‌ఇండియా మేనేజర్‌గా, జాతీయ సెలెక్టర్‌గా క్రికెట్‌కు ఎనలేని సేవ చేశారు. ఆయన మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ తోపాటు పలువురు క్రికెటర్లు సంతాపం వ్యక్తం చేశారు.

మాథ్యూస్‌కు పిలుపు

బెంగళూరు: శ్రీలంక సీనియర్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్‌కు అనూహ్య అవకాశం దక్కింది. వన్డే ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్థాన్‌తో పోరులో లంక యువ బౌలర్ పతిరణ గాయ పడటంతో మాథ్యూస్‌ను మెగా టోర్నీకి ఎంపిక చేశారు. గురువారం ఇంగ్లండ్‌తో జరుగనున్న మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉండనున్నాడు.

సాత్విక్ జోడీ శుభారంభం

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మంగళవారం సింధు 12-21, 21-18, 21-15తో జార్జియా మరిస్కాపై విజయం సాధించగా.. పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట ముందంజ వేసింది.

సరబ్‌జ్యోత్‌కు కాంస్యం

న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ సరబ్‌జ్యోత్ సింగ్ కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఈ ఫలితంతో వచ్చే ఏడాది జరుగనున్న పారిస్ ఒలింపిక్స్ బెర్త్ దక్కించుకున్నాడు.

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్	5	5	0	+1.35	10
దక్షిణాఫ్రికా	5	4	1	+2.37	8
న్యూజిలాండ్	5	4	1	+1.48	8
ఆస్ట్రేలియా	4	2	2	-0.19	4
పాకిస్థాన్	5	2	3	-0.40	4
అఫ్గానిస్థాన్	5	2	3	-0.96	4
నెదర్లాండ్స్	4	1	3	-0.79	2
శ్రీలంక	4	1	3	-1.04	2
ఇంగ్లండ్	4	1	3	-1.24	2
బంగ్లాదేశ్	5	1	4	-0.25	2

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

158 వాహనాలు ఢీ.. ఏడుగురు మృతి

అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

వాషింగ్టన్, అక్టోబర్ 24: దట్టమైన మంచు, ముందు ఏముందో సరిగ్గా కనపడని పరిస్థితి. దీంతో ఒకటీ రెండు కాదు ఏకంగా 158 వాహనాలు ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. అమెరికాలోని లూసియానా రాష్ట్రం ఇంటర్ స్టేట్ 55 రహదారిపై ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో ఏడుగురు మరణించగా, 25 మంది గాయపడ్డారు. సోమవారం రాత్రి దట్టమైన మంచు కారణంగా పలు వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. అనంతరం మంటలు చెలరేగాయి. కొన్ని పై వంతెన నుంచి కింద నీటిలో పడ్డాయి. కార్లు, వాహనాలు తీవ్రంగా దెబ్బతిని నుజ్జునుజ్జయ్యాయి. ఏం జరుగుతుంతో తెలియక వాహనదారుల అరుపులు, కేకలతో భీతావహ వాతావరణం ఏర్పడింది. స్థానికంగా ఎండిన పొలాలను దహనం చేయడం వల్ల దట్టమైన పొగ కమ్ముకోవడం, దీనికి మంచు తోడవడంతో.. దారి కనబడక ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

పుతిన్‌కు గుండెపోటు!

మాస్కో, అక్టోబర్ 24: రష్యా అధ్యక్షుడు పుతిన్ గుండెపోటుకు గురయ్యారని బ్రిటన్ దినపత్రిక 'ద ఎక్స్‌ప్రెస్ యూకే' వార్తా కథనం వెలువరించింది. అధ్యక్షుడు పుతిన్ అధికారిక భవనం మాజీ అధికారి ఒకరు నడుపుతున్న టెలిగ్రామ్ ఛానల్ (జనరల్ ఎస్‌వీఆర్) తొలుత ఈ విషయాన్ని పోస్ట్ చేసిందని వార్తా కథనం పేర్కొన్నది. 71 ఏండ్ల పుతిన్.. ఓ ప్రైవేట్ భవనంలో ఉండగా హఠాత్తుగా నేలపై పడిపోయారని, కను గుడ్లు రెండూ తేలేశారని, అధ్యక్షుడు కిందపడ్డ శబ్దం విని వ్యక్తిగత భద్రతా సిబ్బంది వెంటనే ఆయన వద్దకు వచ్చారని సదరు టెలిగ్రామ్ ఛానల్ తన పోస్ట్‌లో తెలిపింది.

చైనా రక్షణ మంత్రి లీ షాంగ్ఫూ తొలగింపు

బీజింగ్: రెండు నెలలుగా కనిపించకుండా పోయిన రక్షణ మంత్రి లీ షాంగ్ఫూను చైనా ప్రభుత్వం పదవి నుంచి తొలగించింది. మార్చిలో లీ ఈ పదవిలో నియమితులయ్యారు. ఆగస్టు 29న ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఆ తర్వాత బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. గతంలో ఇదే విధంగా అదృశ్యమైన విదేశాంగ మంత్రి కిన్ గాంగ్‌ను జూలైలో ఆ పదవి నుంచి తొలగించారు. వీరిద్దరి తొలగింపునకు కారణాలను వెల్లడించలేదు. జిన్‌పింగ్ అధికారాన్ని వీరిద్దరూ ప్రశ్నించినట్లు తెలుస్తున్నది.

వీధికుక్కలు తరమడంతో కిందపడి

పరాగ్ దేశాయ్ మృతి

వాఘ్ బక్రీ టీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దుర్మరణం

అహ్మదాబాద్: వాఘ్ బక్రీ టీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరాగ్ దేశాయ్ (50) కన్నుమూశారు. వీధి కుక్కల నుంచి తప్పించుకొనే క్రమంలో కింద పడిపోవడంతో పరాగ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆదివారం తన నివాసం ఆవరణలో ఈవినింగ్ వాక్‌కు వెళ్లిన ఆయనపై వీధి కుక్కలు దాడి చేయబోయాయి. వాటి నుంచి తప్పించుకొనే క్రమంలో కింద పడటంతో మెదడుకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన అహ్మదాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించి బ్రెయిన్‌కు సర్జరీ చేశారు. డాక్టర్ పరిశీలనలో ఉండగానే కన్నుమూశారు. దేశంలోని ప్రఖ్యాత టీ పొడి కంపెనీల్లో వాఘ్ బక్రీ టీ గ్రూప్ ఒకటి.

కరెంట్ అడిగిన పాపానికి

కర్ణాటకలో రైతుల అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

ఎండిపోవడంతో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇస్తామన్న ఐదు గంటల విద్యుత్తును కూడా ప్రభుత్వం సరఫరా చేయట్లేదని, గంటసేపైనా కరెంటు ఉండట్లేదని అన్నదాతలు వాపోతున్నారు. విద్యుత్తు కోతలను నిరసిస్తూ కర్ణాటక ఫార్మర్స్ అసోసియేషన్ (కేఎఫ్ఏ) ఆధ్వర్యంలో మంగళవారం దసరా నాడు మైసూరులోని బెంగళూరు-మైసూరు హైవేను రైతన్నలు దిగ్బంధించేందుకు యత్నించారు. అయితే కరెంట్ అడిగిన పాపానికి వీరిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. నిర్దాక్షిణ్యంగా అరెస్ట్ చేసింది. కేఎఫ్ఏ అధ్యక్షుడు కురుబూర్ శాంతకుమార్ సహా పలువురు రైతు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై శాంతకుమార్ మండిపడ్డారు. కాంగ్రెస్‌పాలనలో రైతుల దసరా కనిపించడం లేదని, మంత్రుల దసరా కనిపిస్తున్నదన్నారు. అన్నదాతల గోసను పట్టించుకోకుండా కాంగ్రెస్ మంత్రులు సంబురాల్లో మునిగితేలుతున్నారని ధ్వజమెత్తారు. రైతు వ్యతిరేక, నియంతృత్వ కాంగ్రెస్ సర్కారుకు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.

గంట కూడా ఇస్తలేరు

వ్యవసాయానికి 5 గంటలు విద్యుత్తు ఇస్తామని విద్యుత్తు శాఖ మంత్రి ఇటీవలే ఆర్భాటంగా ప్రకటించారని, అయితే దానికి ప్రభుత్వం కట్టుబడలేదని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం గంటసేపైనా కరెంటు ఉండట్లేదని వాపోతున్నారు. ఈ మేరకు జాతీయ మీడియా ఎన్డీటీవీ చేసిన ఫీల్డ్ స్టడీలో వెల్లడైంది. కిందటేడాది ఆగస్టులో 8,000 మెగావాట్ల నుంచి 8,500 మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ నెలకొనగా, ఈ ఏడాది ఆగస్టు-సెప్టెంబర్‌లో అది 15,000 మెగావాట్ల నుంచి 16,000 మెగావాట్లకు చేరుకొన్నది. రాష్ట్రంలో రోజూవారీ విద్యుత్తు కొరత 1,500 మెగావాట్ల నుంచి 2,000 మెగావాట్ల వరకు ఏర్పడుతున్నది. లోటు వర్షపాతం, బొగ్గు నిల్వలు అడుగంటిపోవడమే దీనికి కారణమని ప్రభుత్వం చెబుతుండగా, సర్కారు ఉదాసీన వైఖరి ఈ దుస్థితికి కారణమని రైతులు మండిపడుతున్నారు.

రైతన్నల నిరసనలు

విద్యుత్తు కోతలకు నిరసనగా కర్ణాటకవ్యాప్తంగా రైతన్నలు నిరసనలు చేపడుతున్నారు. మొన్నటిమొన్న విజయపుర జిల్లా కొల్హారా తాలూకాలోని రోణిహాల్ గ్రామ రైతులు.. హుబ్లీ ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ లిమిటెడ్ కార్యాలయానికి ఓ ట్రాక్టర్‌లో మొసలిని తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఐదు గంటలు కరెంటిస్తామని, ఒకట్రెండు గంటలే ఇస్తున్నారని, అది కూడా రాత్రిపూట ఇస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు, గుల్బర్గా జిల్లాలో రైతన్నలు పురుగుల మందుల డబ్బాలతో విద్యుత్తు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలని, లేదంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

పంటలు ఎలా పండించాలి

ఐదు గంటల కరెంటు ఇస్తామని కాంగ్రెస్ సర్కారు హామీఇచ్చింది. అయితే, గంటపాటైనా విద్యుత్తు సరఫరా జరుగట్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మేమెలా పంటలు పండించాలి?

- నారాయణస్వామి, కోలార్ రైతు

భారత్‌లో ఏసీలకు వాడే కరెంట్ ఆఫ్రికా ఖండం మొత్తం విద్యుత్తుకు సమానం!

2050 నాటికి 9 రెట్లు పెరుగుతుందని ఐఈఏ అంచనా

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: భారత్‌లో విద్యుత్తు వినియోగం నానాటికీ అధికమవుతున్నదని, దీంతో కేవలం ఇండ్లలో ఎయిర్ కండిషనర్ (ఏసీ)లకు ఉపయోగించే విద్యుత్తే 2050 నాటికి ఏకంగా 9 రెట్లు పెరుగుతుందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) వెల్లడించింది. ఇది ఆఫ్రికా ఖండంలోని అన్ని దేశాల్లో వినియోగించే మొత్తం విద్యుత్తు కంటే అధికంగా ఉంటుందని స్పష్టం చేసింది. రానున్న 3 దశాబ్దాల్లో భారత ఇంధన డిమాండ్ ప్రపంచంలోని ఏ ప్రాంతంలో లేదా ఏ దేశంలో లేనంత భారీగా పెరుగుతుందని తాజా నివేదికలో పేర్కొన్నది.

భారత్‌లో విద్యుత్తు సరఫరా
- 2022- 42 ఎక్సాజౌల్స్
- 2030- 53.7 ఎక్సాజౌల్స్
- 2050- 73 ఎక్సాజౌల్స్

భారత్‌లో ఏసీల వినియోగం
2010లో - ప్రతి 100 కుటుంబాలకు 24
3 రెట్లు- గత 12 ఏండ్లలో పెరిగిన ఏసీల సంఖ్య

యూపీ ప్రభుత్వ దవాఖానలో నిర్లక్ష్యం

15 మంది బాలలకు హెపటైటిస్, హెచ్ఐవీ

లక్నో, అక్టోబర్ 24: యూపీలోని ఒక ప్రభుత్వ దవాఖాన సిబ్బంది నిర్లక్ష్యం 14 మంది బాలబాలికల ప్రాణాలమీదకు తెచ్చింది. రక్త నిర్ధారణ పరీక్షలు నిర్లక్ష్యంగా చేయడంతో తలసేమియాకు చికిత్స పొందుతున్న ఆరు నుంచి 16 ఏండ్ల లోపు 14 మంది బాలబాలికలు హెచ్ఐవీ, హెపటైటిస్ లాంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడ్డారు. వీరిలో ఆరుగురికి హెపటైటిస్ బీ, ఆరుగురికి హెపటైటిస్ సీ, ఇద్దరికి హెచ్ఐవీ సోకింది. సరైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయకుండా వీరికి రక్తం ఎక్కించడం వల్ల వీరికి ఈ పరిస్థితి ఏర్పడినట్టు కాన్పూర్‌లోని డాక్టర్లు తెలిపారు. ఈ ఘటన ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే లాలా లజపతి రాయ్ దవాఖానలో చోటుచేసుకుంది.

24 గంటల్లో 704 మంది

- ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారన్న హమాస్
- చాలా దవాఖానల్లో నిలిచిన వైద్య సేవలు

రఫా,అక్టోబర్ 24 : గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సైన్యం దాడులను మరింత తీవ్రతరం చేసింది. దాడుల్లో గత 24 గంటల వ్యవధిలో 704 మంది పౌరులు మరణించారని గాజా ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం వెల్లడించారు. వీరిలో 305 మంది చిన్నారులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. మరోవైపు బాంబు దాడులు, విద్యుత్తు కొరతతో గాజా వ్యాప్తంగా చాలా వరకు దవాఖానలు మూతపడుతున్నాయి. దీంతో రోగులు, బాంబు దాడుల క్షతగాత్రులకు వైద్యం అందడం కష్టతరంగా మారింది. హమాస్ కమాండర్లు, తీవ్రవాదులే లక్ష్యంగా గత 24 గంటల్లో 400 వైమానిక దాడులు చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది.

ఇద్దరు బందీల విడుదల

ఇజ్రాయెల్‌కు మద్దతు తెలుపుతూ ఆ దేశ ప్రధాని నెతన్యాహూతో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ మంగళవారం భేటీ అయ్యారు. కాగా, గాజాపై చేస్తున్న దాడులు ఇజ్రాయెల్‌కే బెడిసి కొట్టే అవకాశం ఉన్నదని అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా హెచ్చరించారు. గాజాపై ఆంక్షలు పాలస్తీనియన్లలో ఆగ్రహాన్ని పెంచడమే కాకుండా ఇజ్రాయెల్‌కు అంతర్జాతీయ మద్దతునూ బలహీనపరుస్తాయని చెప్పారు. ప్రాణ నష్టాన్ని పట్టించుకోని ఇజ్రాయెల్ సైనిక వ్యూహాలు.. ఎదురుతగిలే ప్రమాదం ఉందన్నారు. హమాస్ చెరలో 222 మంది బందీలుగా ఉన్నట్టు ఇజ్రాయెల్ వెల్లడించింది. హమాస్ సోమవారం ఇద్దరు ఇజ్రాయెల్ వృద్ధురాళ్లను విడిచిపెట్టింది. హమాస్ మిలిటెంట్లు, వారి చెరలో బందీలుగా ఉన్న ఆచూకీ చెప్పాలని గాజా వాసులకు ఇజ్రాయెల్ సైన్యం ఆఫర్ ఇచ్చింది. వివరాలు గోప్యతంగా ఉంచుతామని, రక్షణ కల్పిస్తామని, ప్రైజ్ మనీ కూడా ఇస్తామని మంగళవారం పేర్కొన్నది.

భారతీయులకు ఉచితంగా శ్రీలంక వీసా

కొలంబో, అక్టోబర్ 24: ఇక నుంచి భారత్, మరో ఆరు దేశాల వారు వీసాలకు ఎలాంటి రుసుం చెల్లించనవసరం లేకుండా శ్రీలంక టూరిస్టు వీసాలను ఉచితంగా పొందవచ్చు. భారత్ సహా చైనా, రష్యా, మలేషియా, జపాన్, ఇండోనేషియా, థాయిలాండ్‌కు చెందిన టూరిస్టులకు ఉచితంగా వీసాను మంజూరు చేస్తామని ఆ దేశ విదేశాంగ మంత్రి అలీప సాబ్రీ మంగళవారం తెలిపారు. తక్షణం ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని, దీన్ని వచ్చే ఏడాది మార్చి 31 వరకు పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు. రుణ ఊబిలో చిక్కుకున్న శ్రీలంకలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు.

కర్తార్‌పూర్ కలిపింది ఇద్దరినీ

లాహోర్, అక్టోబర్ 24: భారత్-పాకిస్థాన్ విభజన సందర్భంగా చోటుచేసుకున్న అల్లర్లలో విడిపోయిన అక్కా తమ్ముళ్లు 76 ఏండ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకున్న ఉద్వేగపూరిత దృశ్యం కర్తార్‌పూర్‌లో చోటుచేసుకుంది. పాకిస్థాన్‌లో ఉంటున్న మహమ్మద్ ఇస్మాయిల్, భారత్‌లో ఉంటున్న అతని కజిన్ సురీందర్ కౌర్‌లు తమ బంధువులతో కలిసి గురుద్వార దర్బార్ సాహిబ్ ఉన్న కర్తార్‌పూర్ వచ్చి ఒకరినొకరు కలుసుకుని ఆలింగనం చేసుకున్నారు. కొన్ని దశాబ్దాల పాటు దూరంగా ఉన్న వీరిని సామాజిక మాధ్యమం కలిపిందని పాకిస్థాన్ అధికారులు తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు ఇస్మాయిల్, కౌర్ కుటుంబాలు భారత్‌లోని జలంధర్ జిల్లాలోని షాకత్‌లో ఉండేవి. అయితే పాకిస్థాన్ విభజన తర్వాత అల్లర్లు చెలరేగడంతో కౌర్ కుటుంబం భారత్‌లోనే ఉండగా, ఇస్మాయిల్ కుటుంబం పాకిస్థాన్‌కు వలసపోయింది. ఇటీవల ఇస్మాయిల్ గురించి ఒక పాకిస్థాన్ యూట్యూబ్ ఛానల్ ప్రసారం చేసింది. దానిని చూసి ఆస్ట్రేలియాకు చెందిన ఒక వ్యక్తి కౌర్ కుటుంబం గురించి తెలియజేశారు. దీంతో ఇరు దేశాలకు చెందిన వీరు కర్తార్ వేదికగా 76 ఏండ్ల తర్వాత కలుసుకున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91